# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

ఆదివారం | 14 జూలై 2024 | పేజీలు 8


## 23 రాష్ట్రాల్లో 5 రోజుల పాటు వర్షాలు..

# 800 గ్రామాలకు వరద ముప్పు



**హైదరాబాద్ పెన్ పవర్:**దేశంలోని పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాలను కుండపోత వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. దేశరాజధాని ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ సహా పలు రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. దేశంలోని

-3 లో

## త్వరలో జాబ్ క్యాలెండర్

# తీసుకురాబోతున్నాం





**హైదరాబాద్ పెన్ పవర్:**పదేళ్లు ఉద్యోగాల కోసం యువత కొట్లాడింది. కానీ.. ఇప్పుడు పరీక్షల వాయిదా కోసం కొన్ని రాజకీయ శక్తులు, కొన్ని కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు ఆమరణ దీక్షలు చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. త్వరలోనే జాబ్ క్యాలెండర్ ను తీసుకురాబోతున్నామని రేవంత్ రెడ్డి అన్నారు. యూపీఎస్సీ తరహాలో ప్రతీ ఏటా క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. జేఎన్టీయూ ఆద్వర్యంలో నిర్వహించిన క్వాలిటీ విద్యపై సదస్సులో ముఖ్య అతిథులుగా సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఇంజనీరింగ్ విద్యపై విద్యాసంస్థల యాజమాన్యాలతో ఇంటరాక్షన్ ఏర్పాటు చేశారు. పుస్తకాల్లో చదువులకు, బయట మార్కెట్ లో సమాజానికి ఏమాత్రం పొంతన లేకుండా ప్రస్తుతం అకాడమిక్ సిలబస్ లు ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రతి ఏటా లక్షల మంది ఇంజనీరింగ్ స్టూడెంట్లు పట్టాలు తీసుకుంటున్నారే తప్పా.. వారిలో పనితనం ఉండట్లేదని ఆయన అన్నారు. ప్రపంచ దేశాల విద్యార్థులతో పోటీ పడే విధంగా టెక్నికల్ కోర్సులు సిలబస్ మారాలని రేవంత్ రెడ్డి కోరారు.

-2లో

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బీజేపీతో టచ్‌లో ఉన్నారు కానీ...

# షరతు విధిస్తున్నాం

రాజీనామా చేసి రావాలని షరతు విధిస్తుండటంతో వెనుకడుగు వేస్తున్నారని వ్యాఖ్య

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బెదిరించి కాంగ్రెస్ చేర్చుకుంటోందని ఆరోపణ

రాష్ట్రంలో ఎప్పుడైనా... ఏమైనా జరగవచ్చని ఆసక్తికర వ్యాఖ్య



**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చాలామంది బీజేపీతో టచ్‌లో ఉన్నారని... కానీ రాజీనామా చేసి రావాలని షరతు విధిస్తుండటంతో వెనకడుగు వేస్తున్నట్లుగా ఉందని బీజేపీ శాసన సభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బెదిరించి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎప్పుడైనా... ఏమైనా జరగవచ్చునని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి అవినీతి పాలనపై బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. ప్రజాక్షేత్రంలో వారి అవినీతిని ఎండగడతామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా అమలు చేయలేదన్నారు.

-2 లో

## వృద్ధురాలి ఆసరా పెన్షన్ రికవరీ నోటీసులు...

# మంత్రి సీతక్క వివరణ

మల్లమ్మకు డబుల్ పెన్షన్ వస్తోందన్న సీతక్క

ఒకే వ్యక్తికి రెండు పెన్షన్లు నిబంధనలకు విరుద్ధమని వెల్లడి

మొత్తం 1,892 మందికి డబుల్ పెన్షన్ వస్తున్నట్లు వెల్లడి

వారందరికీ ట్రెజరీ శాఖ నోటీసులు ఇచ్చిందన్న సీతక్క

**హైదరాబాద్ పెన్ పవర్:**ఆసరా పెన్షన్‌ను తిరిగి చెల్లించాలంటూ కొత్తగూడెం జిల్లాకు చెందిన దాసరి మల్లమ్మ అనే వృద్ధురాలికి అధికారులు నోటీసులు ఇవ్వడంపై మంత్రి సీతక్క స్పందించారు. పెన్షన్ డబ్బులపై వృద్ధురాలికి రికవరీ నోటీసులు రావడంపై విమర్శలు వచ్చాయి. ఈ అంశంపై సీతక్క స్పందిస్తూ... ఇప్పటికే మల్లమ్మ నెలకు రూ.24,073 కుటుంబ పెన్షన్ పొందుతున్నట్లు చెప్పారు. మరోపక్క, మల్లమ్మ కూతురు ఏఎన్ఎంగా పని చేస్తూ మృతి చెందడంతో కుటుంబ పెన్షన్ మరొకటి కూడా వస్తోందన్నారు. మరోవైపు, మల్లమ్మ కొడుకు ఒకరు ప్రభుత్వ


-2 లో



# త్వరలో జాబ్ క్యాలెండర్ తీసుకురాబోతున్నాం






- మొదటి పేజి తరువాయి

ప్రభుత్వానికి భేషజాలు లేవు, నిరుద్యోగులకు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకుంటామన్నారు. నోటిఫికేషన్ల ప్రకారమే ప్రభుత్వం పరీక్షల నిర్వహణ ఉంటుందని అన్నారు. విద్యాసంస్థలు రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారకూడదు అనేదే మా ప్రభుత్వ విధానమని వివరించారు.

ప్రపంచంలో అద్భుతాలు సృష్టించేది ఇంజనీర్లు మాత్రమేనని. సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులను ప్రస్తుతం కాలేజీలు నిర్లక్ష్యం చేస్తున్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజెంట్ సంక్షేమమే ఫస్ట్ ప్రియారిటీగా ఉందని. ఆ తర్వాతే అభివృద్ధిని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ ఏఐ సమ్మిట్ హైదరాబాద్ – 2024 లోగోను విడుదల చేశారు.

JNTU ఏటా లక్షమంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు పాస్ ఔవుట్ అవుతున్నారు. ఇంజనీరింగ్ కాలేజీలు అంటే నిరుద్యోగులను ఉత్పత్తి చేసే ఫాక్టరీలుగా ఉండకూడదని సూచించారు ముఖ్యమంత్రి. గత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించలేదని.. ఈ అకాడమిక్ ఈయర్ నుంచి బకాయిలు లేకుండా ఫీజు రీయింబర్స్ చెల్లిస్తామన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ తీసుకొచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వమని రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ లో నాడు IDPL ను ఇందిరా గాంధీ పెట్టడం వల్లే నేడు ఫార్మారంగం అభివృద్ధి చెందిందన్నారు. పరీక్షలు వాయిదా వేస్తే విద్యార్థులకే తీవ్ర నష్టం జరుగుతుందని వివరించారు.

2030 నాటికల్లో ఐటీ రంగంలో కర్ణాటకని అదిగమిస్తామని ఐటీ శాఖ మంత్రి తెలిపారు. 200 ఎకరాల్లో ఏఐ సిటీని నిర్మిస్తున్నామని ఆయన అన్నారు. మంచి సలహాలు ఇస్తే అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఐటీ మినిస్టర్ శ్రీధర్ బాబు విద్యావేత్తలను కోరారు. రాబోయే రోజుల్లో సాఫ్ట్ వేర్ రంగంలో మనమే ముందుంటామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

## వృద్ధురాలి ఆసరా పెన్షన్ రికవరీ నోటీసులు... మంత్రి సీతక్క వివరణ

- మొదటి పేజి తరువాయి

ఉద్యోగి అని, మరొకరు ప్రైవేటు ఉద్యోగి అని తెలిపారు. అయితే ఇక్కడ ఒకే వ్యక్తి రెండు పెన్షన్లు పొందడం అన్నది నిబంధనలకు విరుద్ధమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,862 మందికి డబుల్ పెన్షన్లు వస్తున్నాయని, వీరికి ట్రెజరీ శాఖ నోటీసులు ఇచ్చిందన్నారు. వీరు ప్రభుత్వ కుటుంబ పెన్షన్, వృద్ధాప్య పెన్షన్ పొందుతున్నారన్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బీజేపీతో టచ్‌లో ఉన్నారు కానీ...

# షరతు విధిస్తున్నాం

- మొదటి పేజి తరువాయి

మేనిఫెస్టోలో ఇచ్చిన 419 హామీలను ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో అతి తక్కువ కాలంలో అప్రతిష్ట మూటకట్టుకున్న ప్రభుత్వం కాంగ్రెస్ అన్నారు. కేంద్రం ఇచ్చిన అమృత్ పథకం నిధుల టెండర్లలో జరిగిన అవినీతిని నిరూపించేందుకు తాము సిద్ధమన్నారు. గ్లోబల్ టెండర్లలో 40 శాతం లెస్‌కు పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోతే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు.

రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలు ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. పాలనలో జవాబుదారీతనం... పారదర్శకత లేవన్నారు. పేరుకే ప్రజాపాలన అని విమర్శించారు. ప్రజాదర్బార్ కనిపించకుండా పోయిందన్నారు. ప్రజాపాలన పేరు మీద రాక్షస పాలన సాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ బాబా.. డజను దొంగలుగా పాలన తెలంగాణలో నడుస్తోందని విమర్శించారు.

# 23 రాష్ట్రాల్లో 5 రోజుల పాటు వర్షాలు..
# 800 గ్రామాలకు వరద ముప్పు

- మొదటి పేజి తరువాయి

23 రాష్ట్రాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ఇక దేశవ్యాప్తంగా 800 గ్రామాలకు వరదముప్పు ప్రమాదం పొంచి ఉందని ...లోతట్టు ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖాధికారులు హెచ్చరికలు జారీచేశారు.,

**తెలంగాణలో....**

తెలుగు రాష్ట్రాల్లో ఐదురోజుల పాటు ( జులై 14 నుంచి) తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండీ చెప్పింది. అయితే ఇవాళ ( జులై 13) తెలంగాణకు భారీ వర్ష సూచన చేసింది హైదరాబాద్ వాతావరణశాఖ. రాత్రికి హైదరాబాద్, ఉత్తర తెలంగాణ, ఉత్తరాంధ్రలో మోస్తరు వాన పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

తెలంగాణలో ఈదురు గాలులతో కూడిన వర్షం పడే అవకాశముంది. తెలంగాణలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, సంగారెడ్డి,మెదక్, కామారెడ్డిలో జిల్లాల్లో భారీ వర్షాలు పడనున్నాయి. దాంతో ఈ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.రానున్న మూడ్రోజులు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది.

దేశవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి, ఉత్తర భారతంలోని రాష్ట్రాలతో పాటు తూర్పు భారతదేశంలోని రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాబోయే ఐదు రోజులు ( జులై 14 నుంచి) మధ్య, ఈశాన్య, తూర్పు భారతదేశం మరియు ఉత్తరప్రదేశ్‌లో చాలా చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని %×వీణ% అంచనా వేసింది. కొంకణ్, గోవా, సెంట్రల్ మహారాష్ట్ర మరియు కోస్టల్ కర్నాటకలో పలు ప్రదేశాల్లో కుండపోతగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

**ఆంధ్రప్రదేశ్ లో...**

పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దక్షిణ ఆంధ్ర ప్రదేశ్ తీరములో సముద్ర మట్టానికి సగటున 5.8 కి.మీ ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించింది. ఈశాన్య అస్సాం నుండి వాయువ్య బంగాళాఖాతం వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో ఒక ద్రోణి కొనసాగి ఈరోజు బలహీనపడింది. సగటు సముద్ర మట్టానికి 3.1 కి.మీ ఎత్తులో పశ్చిమ అస్సాం నుండి వాయువ్య బంగాళాఖాతం వరకు ఒక ద్రోణి కొనసాగి బలహీనపడింది. దీని ప్రభావంతో మరో ఐదు రోజులు పాటు ( జులై 14 నుంచి ఏపీలో వర్షాలు కురుస్తాయని విశాఖ వాతావరణ కేంద్రం వెల్లడించింది. కోస్తా జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశముందని, రాయలసీమ జిల్లాలో తేలికపాటి వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఉత్తర, దక్షిణ కోస్తా జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

**దేశవ్యాప్తంగా...**

బీహార్ రాష్ట్రానికి వరద తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపింది. జార?ండ్‌లో రుతుపవనాలు మళ్లీ చురుకుగా మారాయి. ఛత్తీస్‌గఢ్, ఒడిశాలో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా చాలా చోట్ల వరదలు వచ్చాయి. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో ఆది, సోమవారాలు ( జులై 14,15) భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. అయితే ఈశాన్య భారతదేశంలో రాబోయే ఐదు రోజులు ( జులై14 నుంచి) పిడుగులు పడే ఉండొచ్చని IMDపేర్కొంది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో భారీ వర్షం కురిసింది. 12 గంటల వ్యవధిలోనే అత్యధికంగా 90 మిమీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. ఈ వర్షానికి పలు ప్రధాన రహదారులు పూర్తిగా జలమయమయ్యాయి. దీంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తాయి. మరోవైపు నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. జులై 14 నుంచి ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఇటావా, ఔరైయా, గొండా, కన్నౌజ్, అయోధ్య సహా పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. మరోవైపు భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్ర అధికారులు అప్రమత్తమయ్యారు.

మరోవైపు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోనూ వర్షాలు కురుస్తున్నాయి. ఆ రాష్ట్రంలోని డెహ్రాడూన్, నైనిటల్, చంపావత్, ఉధమ్ సింగ్ నగర్ జిల్లాల్లో సెప్టెంబర్ 13న భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్రంలోని 23 జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఎల్లో అలర్ట్ ప్రకటించారు. ఈ మేరకు కొన్ని ప్రాంతాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించారు. తెహ్రీ, బాగేశ్వర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో నిరంతరాయంగా కురుస్తున్న వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడడంతోపాటు ఇళ్లు కూలిపోయాయి.

ఇక రాజస్థాన్, గుజరాత్, ఒడిశా, జార?ండ్, పశ్చిమ బెంగాల్‌లోనూ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ఒడిశాలో జులై 14, 15 తేదీల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. అదేవిధంగా తూర్పు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కోస్తా ఆంధ్ర ప్రదేశ్, కేరళ, తెలంగాణ రాష్ట్రాల్లో రానున్న రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. అస్సాం, మేఘాలయలో ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని చెప్పింది. నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపురలో వర్ష ప్రభావం ఉండొచ్చని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

# కుటుంబ వ్యవస్థలు విచ్ఛిన్నం కావడం వల్లే పిల్లలు పక్కదారి పడుతున్నారు: రేవంత్ రెడ్డి

**విద్యార్థులకు మంచీ చెడులు చెప్పాల్సిన బాధ్యత మన పైనే ఉందన్న సీఎం**

**విద్యార్థులందరూ మన పిల్లలు అనేలా అందరూ చూసుకోవాలని సూచన**

**డ్రగ్స్ వల్ల యువత నిర్వీర్యం అవుతోందని ఆవేదన**

**తల్లిదండ్రులు తమ పిల్లలకు సమయం కేటాయించాలని సూచన**



**హైదరాబాద్ పెన్ పవర్:**కుటుంబ వ్యవస్థలు విచ్ఛిన్నం కావడం వల్లే చాలామంది పిల్లలు పక్కదారి పడుతున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థులకు మంచీ చెడులు చెప్పాల్సిన బాధ్యత మనపైనే ఉందన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణ, మహిళల భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో కార్యక్రమం నిర్వహించారు.ఐఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... విద్యార్థులందరూ మన పిల్లలు అనేలా అందరూ చూసుకోవాలని సూచించారు. డ్రగ్స్ వల్ల యువత నిర్వీర్యం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు సమయం కేటాయించాలని సూచించారు. వారికి మంచీ చెడులు చెప్పాలన్నారు.

# ఉప ఎన్నికల ఫలితాలు: జలంధర్ వెస్ట్‌లో ఆప్ గెలుపు.. మిగతా చోట్ల ఇండియా కూటమి హవా

ఏడు రాష్ట్రాల్లోని 13 స్థానాలకు ఈ నెల 10న ఉప ఎన్నికలు

పశ్చిమ బెంగాల్‌లోని నాలుగు స్థానాల్లోనూ టీఎంసీ హవా

హిమాచల్ ప్రదేశ్‌లో అనూహ్యంగా లీడ్‌లోకి దూసుకొచ్చిన కాంగ్రెస్

హైదరాబాద్ పెన్ పవర్:ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు ఈ నెల 10న జరిగిన ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు ఈ ఉదయం మొదలు కాగా, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తొలి విజయాన్ని నమోదు చేసింది. మిగతా 12లో 10 స్థానాల్లో ఇండియా కూటమి అభ్యర్థులు ఆధిక్యంలో కొనసాగుతున్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికల ఫలితాలు బీజేపీకి లిట్మస్ టెస్ట్‌లా మారాయి. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ మార్కు అందుకోలేకపోయిన బీజేపీ, మెజార్టీ మార్కుకు చేరువగా వచ్చిన కాంగ్రెస్ కూటమి ఈ ఎన్నికలను సవాలుగా తీసుకున్నాయి.



పశ్చిమ బెంగాల్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు, పంజాబ్, బీహార్‌లలో ఈ ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు మొదలైంది. పశ్చిమ బెంగాల్‌లోని బాగ్దా, రాణాఘాట్, మణిక్తల, రాయ్‌గంజ్‌లోని నాలుగు స్థానాల్లోనూ అధికార తృణమూల్ కాంగ్రెస్ ఆధిక్యంలో కొనసాగుతోంది. ఉత్తరాఖండ్‌లోని మంగ్లావుర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఖాజీ నిజాముద్దీన్ తన సమీప బీఎస్పీ అభ్యర్థి ఉబేదర్ రెహ్మాన్‌పై 12,540 ఓట్ల ఆధిక్యంతో కొనసాగుతున్నారు. బద్రీనాథ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి లఖపత్ సింగ్ బుటోలా లీడ్‌లో ఉన్నారు. పంజాబ్‌లోని జలంధర్ వెస్ట్‌లో ఆప్ అభ్యర్థి మొహిందర్ భగత్ తన సమీప కాంగ్రెస్ అభ్యర్థిపై 37,325 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఇక్కడి నుంచి విజయం సాధించిన ఆప్ ఎమ్మెల్యే శీతల్ అంగురల్ బీజేపీలో చేరడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది.

తమిళనాడులోని విక్రవంది అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో అధికార డీఎంకే అభ్యర్థి అన్నియూర్ శివ లీడింగ్‌లో ఉన్నారు. బీహార్‌లో జేడీయూ అభ్యర్థి కళాధర్ ప్రసాద్ మండల్ 2,433 ఓట్లతో ఆధిక్యంలో కొనసాగుతున్నారు.

మధ్యప్రదేశ్‌లోని చింద్వారా జిల్లా అమర్వారా నియోజకవర్గంలో బీజేపీ ఆధిక్యంలో ఉండగా, హిమాచల్ ప్రదేశ్‌లో తొలుత వెనకబడిన కాంగ్రెస్ పుంజుకుని ఆధిక్యంలోకి దూసుకొచ్చింది. ఇక్కడ మూడు స్థానాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు ఆధిక్యంలో కొనసాగుతున్నారు. డేహ్రాలో తొలుత వెనకబడిన సీఎం సుఖ్విందర్ సుఖు భార్య కమలేశ్ ఠాకూర్ 16,984 ఓట్లతో ఆధిక్యంలోకి దూసుకొచ్చారు.

## అందుకే మా ఫ్యామిలీ నుంచి ఇండస్ట్రీకి వెళ్లడానికి ఎవరూ ఆసక్తిని చూపలేదు: కాంతారావు కూతురు సుశీల

జానపద కథానాయకుడిగా మెప్పించిన కాంతారావు

సొంత సినిమాలతో వచ్చిన నష్టం

ఆయన చాలా మొండిమనిషన్న కూతురు

ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన

హైదరాబాద్ పెన్ పవర్:కాంతారావు .. తెలుగు తెరపై తిరుగులేని జానపద కథానాయకుడు. ఒక వైపున పౌరాణికాలతో ఎన్టీఆర్ .. మరో వైపున రొమాంటిక్ హీరోగా అక్కినేని దూసుకుపోతున్న సమయంలో, జానపదాలను పరిగెత్తించిన రాకుమారుడు. అలాంటి కాంతారావు .. చివరి రోజులలో ఆర్థికపరమైన సమస్యలతో పోరాడారు. ఆయన గురించిన అనేక విషయాలను కూతురు సుశీల సుమన్ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రస్తావించారు.



"1964లోనే మద్రాసులో నాన్న పెద్ద బంగ్లా కొన్నారు. 3 కార్లు .. 8 మంది నౌకర్లు ఉండేవారు. మాకు ఎలాంటి కష్టం తెలియకుండా ఆయన పెంచారు. అలాంటి ఆయన సొంతంగా తీసిన 5 సినిమాల కారణంగా ఆస్తిపాస్తులను పోగొట్టుకోవలసి వచ్చింది. ఆయన చాలా మొండిమనిషి .. ఎవరు చెప్పినా వినిపించుకునేవారుకాదు. తాను ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్టు నాన్న ఎవరికీ చెప్పుకోలేదు. తెలిసినా ఎవరూ సాయం చేయడానికి ముందుకు రాలేదు" అన్నారు.

"నాన్నకి జాగ్రత్తపడటం తెలియదు. పక్కనే ఉంటూ ఆయనని గైడ్ చేసేవారు కూడా లేరు. అందువలన తనకి తోచింది చేస్తూ వెళ్లారు. ఆయనకి ఇల్లు కూడా లేకుండా కష్టపడుతున్నాడనీ, చిన్నచిన్న వేషాలు వేస్తున్నారని తెలిసినా ఎవరూ పట్టించుకోలేదు. మేమున్నాము అని నాన్నకి సాయం చేసేంత మంచి మనసు హీరోలకు ఉందని నేను అనుకోవడం లేదు. హీరోలు మాత్రమే కాదు ఏ ఆర్టిస్టు కూడా రాలేదు. నాన్న పోయిన తరువాత అంతా కనిపించకుండా పోయినవారే. అందుకే మా ఫ్యామిలీ వైపు నుంచి ఎవరూ ఇండస్ట్రీకి వెళ్లడానికి ఆసక్తిని చూపలేదు" అని చెప్పారు.

## వరుణ దేవుడా కరుణించవయ్యా... కరీంనగర్ జిల్లాలో కప్పల పెళ్లి







హైదరాబాద్ పెన్ పవర్: కప్పలకు పెళ్లిళ్లు చేస్తే వర్షాలు కురుస్తాయని చాలామంది నమ్ముతారు. ఈ కార్యక్రమాన్ని తూతూ మంత్రంగా జరిపించరు. శుభలేఖలు పంచిపెట్టి, చాలామంది అతిథులను పిలిచి, కప్పలను వధూవరులుగా రెడీ చేసి వైభవంగా పెళ్లి చేస్తారు. వరుణుడి కరుణకోసం కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండల ప్రజలు వేడుకుంటున్నారు.వర్షాలు కురవాలని కప్పలకు పెళ్లిళ్లు చేశారు.

ప్రకృతి దేవతలను ప్రసన్నం చేసుకోవాలంటే కప్పలకు పెళ్లి చేయడం, విందు భోజనం ఏర్పాటు చేయడం లాంటివి గ్రామాల్లో చేస్తుంటారు. కప్పలకు పెళ్లి చేస్తే దేవ దేవేంద్రుడి కరుణతో వర్షాలు కురుస్తాయనే నమ్మకంతో కప్పలకు ఈ వింత పెళ్లి చేస్తుంటారు. వరుణుడి కటాక్షం కోసం కరీంనగర్? జిల్లా ఇల్లందకుంట మండల కేంద్రంలో ఘనంగా కప్పల పెండ్లి జరిపించారు.. అచ్చం మనుషుల పెళ్లిలానే వీటికి వివాహం జరిపించారు.

పూర్తి సంప్రదాయ పద్ధతిలో శాస్త్రోక్తంగా ఈ వివాహం జరిపించారు. కప్పలను వధూవరుల మాదిరిగానే అలంకరించి.. తాళి బొట్టు, పూల దండలు మార్చుకోవడం, సప్తపది, తలంబ్రాలు అన్నీ సంప్రదాయం ప్రకారం నిర్వహించారు. ఈ వేడుకకు భారీ సంఖ్యలో జనం హాజరయ్యారు. అనంతరం భోజనాలు ఏర్పాటు చేశారు.గ్రామస్తులు ఆధ్వర్యంలో వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురవాలని కప్పలకు పెళ్ళి చేసి పూజలు నిర్వహించారు. పెళ్ళి అనంతరం వాటిని ఊరంతా ఊరేగింపు నిర్వహించారు. పురోహితుడు ఆధ్వర్యం లో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని కప్పలకు పెళ్లి చేసి ఊరంతా ఊరేగిస్తే వర్షాలు కురుస్తాయి అంటున్నారు గ్రామస్తులు.. కప్పల పెళ్లి సందర్భంగా వాయిద్యాలు వాయిస్తూ, భజనలు పాడుతూ సందడి చేశారు.

# ఏటా రూ. 8 కోట్లు ఆర్జిస్తున్న యూట్యూబర్!

సీఎన్ బీసీ వార్తాసంస్థకు తన ప్రస్థానాన్ని తెలియజేసిన మాజీ ఇన్వెస్ట్ మెంట్ బ్యాంకర్ నిశ్చా షా

గతంలో లండన్ లో దాదాపు పదేళ్లపాటు పనిచేసినట్లు వెల్లడి

ఇతరులకు సాయం చేస్తూనే ఆర్థికంగా ఎదగాలన్న ఆలోచనతో ఉద్యోగానికి స్వస్తి

సొంత అభిరుచితో ముందుకు సాగాలని యూట్యూబ్ చానల్ కు శ్రీకారం

పర్సనల్ ఫైనాన్స్ విభాగంలో వీడియోలు.. రూ . కోట్లలో సంపాదన

ప్రస్తుతం ఆమెకు 1.16 మిలియన్ల మంది సబ్ స్క్రైబర్లు



**హైదరాబాద్ పెన్ పవర్:**ఆమె ఒకప్పుడు ఓ ఇన్వెస్ట్ మెంట్ బ్యాంకర్... కార్పొరేట్ ప్రపంచంలో కొలువు.. ఏటా ఆరు అంకెల జీతం.. ఆ రంగంలో దాదాపు పదేళ్ల అనుభవం.. మరింతగా పైకి ఎదిగే అవకాశం... కానీ వాటన్నింటినీ వదులుకొని రిస్క్ తీసుకోవాలని ఆమె అనూహ్య నిర్ణయం తీసుకుంది. నిత్యం ఉరుకులు పరుగులు పెట్టే ఉద్యోగ జీవితానికి ఒక్కసారిగా ఫుల్ స్టాప్ పెట్టింది. ఏకంగా యూట్యూబర్ అవతారం ఎత్తింది. కెమెరా పట్టుకొని సొంతంగా వీడియోలు చేయడం మొదలుపెట్టింది. అంతే.. ఏడాది తిరిగేసరికి ఉద్యోగ జీవితంలో సంపాదించిన డబ్బుకన్నా నాలుగు రెట్లు ఎక్కువగా ఆర్జిస్తోంది. ఆమె పేరే నిశ్చా షా.

ఒక్కసారిగా తన కెరీర్ ను మార్చుకోవడానికి దారితీసిన పరిస్థితులను ఆమె ఇటీవల సీఎన్ బీసీ వార్తా చానల్ తో మాట్లాడుతూ పంచుకుంది. 2022 నాటికి బ్యాంకింగ్ రంగంలో చేరి తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న తనకు చేస్తున్న పనిపై ఆసక్తి పోయిందని నిశ్చా షా చెప్పుకొచ్చింది. అప్పటికి లండన్ లోని క్రెడిట్ అగ్రికోల్ అనే సంస్థలో పనిచేస్తూ ఏటా సుమారు రూ. 2 కోట్లు ఆర్జిస్తున్నట్లు తెలిపింది. కానీ జీవితం ఏదో వెలితిగా అనిపించిందని.. చేస్తున్న ఉద్యోగంలో సవాళ్లేమీ లేకపోవడం, తెలివితేటలను పెంచేదిగా లేకపోవడంతో ఏదైనా అర్థవంతమైన పని చేయాలని అనుకున్నట్లు నిశ్చా షా వివరించింది.

'ఇతరులకు సాయం చేస్తూనే ఆర్థికంగా ఎదగాలని భావించా. కానీ అప్పటివరకు నేను చేసిన పని కేవలం కార్పొరేషన్లు, ప్రభుత్వాలకు మాత్రమే ఉపయోగపడింది' అని నిశ్చా షా తెలిపింది. అందుకే 2023 జనవరిలో ఉద్యోగానికి రాజీనామా చేసి యూట్యూబ్ లో పర్సనల్ ఫైనాన్స్ కు సంబంధించిన కంటెంట్ క్రియేటర్ గా మారినట్లు చెప్పింది.

ఆమె తీసుకున్న రిస్క్ ఫలించింది. 2023 మే నుంచి 2024 మే మధ్య ఆమె యూట్యూబ్ మానిటైజేషన్ ద్వారా రూ. 8 కోట్లకుపైగా సంపాదించింది. పర్సనల్ ఫైనాన్స్ కోర్సులు, ఉత్పత్తులు, ప్రముఖులతో ఇంటర్వ్యూలు, ప్రముఖ బ్రాండ్లతో భాగస్వామ్యాల ద్వారా బాగా ఆర్జించింది.

'డబ్బు వెనకాల పరుగులు పెట్టడం మానేశా. అందుకు బదులుగా నా అభిరుచి వెంట పరిగెడుతున్నా. ఇందులోనే ఆనందం వెతుక్కుంటున్నా. గతంలో నేను పొందిన దానికన్నా ఎక్కువగా పొందేందుకు నా అభిరుచే దోహదపడుతోంది' అని నిశ్చా షా చెప్పింది.

అయితే తన యూట్యూబ్ చానల్ హిట్ కావడం అంత ఆషామాషీగా ఏమీ జరగలేదని షా పేర్కొంది. మొదటి వెయ్యి మంది సబ్ స్క్రైబర్లను సాధించేందుకు 11 నెలల సమయం పట్టిందని చెప్పింది. గతంలో అత్యవసర నిధి కింద కొంత డబ్బు దాచుకున్నానని.. దీనివల్ల తన అభిరుచిపై పూర్తిస్థాయిలో దృష్టిపెట్టేందుకు వీలైందని ఆమె వివరించింది. 2022 సెప్టెంబర్ లో తాను చేసిన ఒక వీడియో వల్ల ఏకంగా 50 వేల మంది సబ్ స్క్రైబర్లు ఒక్కసారిగా పెరగడంతో రూ. 3 లక్షలకుపైగా ఆర్జించినట్లు చెప్పింది. ప్రస్తుతం ఆమె చేసే వీడియోలకు కనిష్ఠంగా లక్ష వ్యూస్ నుంచి గరిష్ఠంగా 90 లక్షల వ్యూస్ లభిస్తున్నాయి.

ప్రస్తుతం ఆమె యూట్యూబ్ చానల్ 'నిశ్చా'కు ఏకంగా 1.16 మిలియన్ల మంది సబ్ స్క్రైబర్లు ఉన్నారు. ఇప్పటివరకు ఆమె చేసిన 98 వీడియోల ద్వారానే అంత మంది సబ్ స్క్రైబర్లతోపాటు భారీగా డబ్బు సంపాదిస్తుండటం విశేషం.

# చంద్రబాబుకు ఇచ్చిన మాట నెరవేరుస్తాం: 'అక్షయపాత్ర' అధ్యక్షుడు మధు పండిట్

**హైదరాబాద్ పెన్ పవర్:**మంగళగిరిలోని కొలనుకొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఇవాళ అనంత శేష స్థాపన కార్యక్రమం జరగ్గా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. ఆయనకు ఇస్కాన్ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. చంద్రబాబు పూజా కార్యక్రమాల్లోనూ, పూర్ణాహుతి కార్యక్రమంలోనూ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనకు ప్రాణభిక్ష పెట్టింది వెంకటేశ్వరస్వామి అని వెల్లడించారు. ప్రతి రోజూ తాను వెంకటేశ్వరస్వామికి దండం పెట్టుకుని... తెలుగుజాతికి సేవ చేయడానికి, పేదరికం లేకుండా చేయడానికి నాకు శక్తిసామర్థ్యాలు ఇవ్వాలని కోరుకుంటానని తెలిపారు. పేదరికంలో ఉన్నవారికి చేయూతనివ్వడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. పెనుగొండలో నాడు 108 అడుగుల ఏక రాతి విగ్రహంతో లక్ష్మీనరసింహ స్వామి ఆలయ నిర్మాణానికి ఇస్కాన్ ముందుకు వస్తే... ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం దాన్ని రద్దు చేసిందని చంద్రబాబు ఆరోపించారు. గత ఐదేళ్లలో మంచి పనులు రద్దు చేయడం తప్ప మరొక పని చేయలేదని విమర్శించారు. కాగా, చంద్రబాబు ప్రస్తావించిన ఏక రాతి విగ్రహంతో ఆలయ నిర్మాణంపై అక్షయపాత్ర ఫౌండేషన్ అంతర్జాతీయ అధ్యక్షుడు మధు పండిట్ స్పందించారు. ఆయన కూడా మంగళగిరిలో నేడు జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. "2019లో మీరు మా ఇస్కాన్ కి ఒక బాధ్యత అప్పగించారు. పెనుగొండలో 108 అడుగుల ఏక రాతి విగ్రహంతో లక్ష్మీనరసింహస్వామి ఆలయం నిర్మించమన్నారు. ఇప్పుడు మీకు మాటిస్తున్నాం... మీరు అప్పగించిన బాధ్యతను వచ్చే మూడేళ్లలో పూర్తి చేస్తామని ఇస్కాన్ తరపున ప్రకటిస్తున్నాం"



# తొలి ఏకాదశి విశిష్టత.. ఈ వ్రతం చేస్తే శివకేశవులతోపాటు అమ్మ అనుగ్రహం



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రతీ సంవత్సరం 24 ఏకాదశులు వస్తాయి. అయితే ఆషాడంలో వచ్చే ఏకాదశిని తొలి ఏకాదశిగా పిలుస్తారు. శయనైక ఏకాదశి, హరి వాసరమని, పేలాల పండుగగా కూడా పిలుస్తారు. ఈ పండును తొలి పండుగగా జరుపుకోవడం ఆచారం.సాధారణంగా వ్రతం అంటే ఖర్చుతో కూడుకున్నది అనే భావన ఉంటుంది. కానీ ఏకాదశి వ్రతానికి ఎటువంటి ఖర్చు ఉండదు. పైగా ఖర్చును తగ్గిస్తుంది, ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. ప్రతిమాసంలో ఏకాదశి వ్రతం ఎలా ఆచరించాలో తెలుసుకుందాం...

భారతీయ సంప్రదాయంలో తొలి పండుగగా పిలువబడే తొలి ఏకాదశికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. ఏడాదికి 24 ఏకాదశులు వస్తాయి. ఒకటి శుక్ల పక్షంలో రెండోది బహుళ (కృష్ణ)పక్షంలో వస్తాయి. ఇక అధికమాసం వస్తే మరో రెండు అధికంగా అంటే 26 ఏకాదశులు వస్తాయి. ప్రతి ఒక్క హిందువు తప్పనిసరిగా ఆచరించాల్సిన వ్రతాలల్లో ఏకాదశి వ్రతం అత్యంత కీర్తిగాంచింది. చాలా పవిత్రమైంది.

హిందూ పంచాంగం ప్రకారం ఆషాఢ మాసంలోని తొలి ఏకాదశి లేదా దేవశయని ఏకాదశి తిథి జూలై 16 వ తేదీ మంగళవారం రాత్రి 8:33 గంటలకు ప్రారంభమై.. జూలై 17వ తేదీ బుధవారం రాత్రి 09:02 గంటలకు ముగుస్తుంది.ఉదయతిథి ప్రకారం.. ఈ సంవత్సరం తొలి ఏకాదశి వ్రతాన్ని జూలై 17న జరుపుకుంటారు. ఈ రోజున ఏకాదశి వ్రతాన్ని ఆచరించి, నియమ నిష్ఠలతో విష్ణువుతో పాటు లక్ష్మీ దేవిని పూజిస్తారు. ఇలా చేయడం వల్ల శ్రీ హరి అనుగ్రహంతో జీవితంలో సుఖసంతోషాలు, సిరి సంపదలు కలుగుతాయి.

ఆషాఢ శుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశిగా పిలుస్తారు. దీనికే శయనైకాదశి అని హరి వాసరమని, పేలాల పండుగ అని పేరు. పురాణాలను అనుసరించి శ్రీమహావిష్ణువు క్షీరసాగరంలో శేషతల్పం మీద శయనిస్తాడు.. అలా నాలుగు నెలల పాటు ఆయన పడుకుని.. అక్టోబర్ లేదా నవంబర్ నెలల్లో వచ్చే ప్రబోధినీ ఏకాదశి నాడు తిరిగి మేల్కొంటాడు.

చాతుర్మాస్య దీక్ష ప్రారంభం

ఆషాఢం నుంచి నాలుగు నెలల్ని చాతుర్మాసాలుగా వ్యవహరిస్తారు. అంటే ఆషాఢం, శ్రావణం, బాధ్రపదం, కార్తీకమాసం ఈ నాలుగునెలలు చాలా పవిత్రమైనవి. తొలి ఏకాదశి నుంచి నాలుగు నెలల పాటు చాతుర్మాసదీక్షను ఆచరిస్తారు. ఈ నాలుగు నెలలు స్వామివారు పాతాళలోకంలో బలి చక్రవర్తి వద్ద ఉండి. కార్తీక పౌర్ణమి నాడు తిరిగి వస్తాడని పురాణగాథ. ఉత్తరాయణం కంటే దక్షిణాయణంలో పండుగలు... పర్వదినాలు ఎక్కువగా వస్తాయి. వాతావరణంలో మార్పులు అధికంగా సంభవిస్తాయి కాబట్టి.. ఈ కాలంలో ఆరోగ్య పరిరక్షణా నియమాలు ఆచరించాలి.. అందువల్ల ఈ కాలంలో పెద్దలు వ్రతాలు, పూజలు ఆచరించాలని నిర్దేశించారు. ముఖ్యంగా వర్షకాలం ప్రారంభమయ్యే ఈ సమయంలో వ్రతం పేరిట అనేక కట్టుబాట్లను మనకు పెద్దలు ఏర్పాటుచేశారు.

ఏకాదశినాడు ఎందుకు ఉపవాసం ఉండాలి

పూర్వం కృతయుగంలో మురాసురుడనే రాక్షసుడు బ్రహ్మ వరంతో దేవతలను, రుషులను హింసించడంతో శ్రీ మహా విష్ణువు అతనితో వెయ్యేళ్ల పోరాడి.. అలసిపోయి ఓ గుహలో విశ్రాంతి తీసుకుంటుండగా.. శ్రీహరి శరీరం నుంచి ఓ కన్య ఆవిర్భవించి..రాక్షసుణ్ని అంతం చేసిందట. ఇందుకు సంతోషించిన శ్రీమహావిష్ణువు ఆ కన్యను వరం కోరుకోమనగా.. తాను విష్ణుప్రియగా లోకం చేత పూజించబడాలని కోరుకుందట.. అప్పటి నుంచి ఆమె ఏకాదశి తిథిగా వ్యవహారంలోకి వచ్చింది.. నాటి నుంచి సాధువులు, భక్తజనులు ఏకాదశి వ్రతం ఆచరించి విష్ణు సాయుజ్యం పొందినట్లుగా పురాణాలు చెబుతున్నాయి. అంబరీషుడు, మాంధాత, తదితర పురాణ పురుషులు ఏకాదశి వ్రతాన్ని ఆచరించారు.

### ఏకాదశి వ్రతం ఎలా చేయాలి?

ఏకాదశికి ముందు రోజు అంటే దశమిరోజు రాత్రి పూట భోజనం చేయకూడదు. ఆరోగ్య పరంగా ఇబ్బందులు ఉన్నవారు, ఉద్యోగులు, శ్రామికులు, పిల్లలు, పెద్దలు తేలికపాటి అల్పాహారాన్ని, పండ్లుపాలు తీసుకోవాలి. మరుసటి రోజు అంటే ఏకాదశిరోజు ప్రాతఃకాలం అంటే సూర్యోదయానికి పూర్వమే నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకుని స్నానం, దైవారాధన, దీపారాధన చేసుకుని తమతమ కార్యాక్రమాలు యథావిధిగా చేసుకోవాలి. మధ్యాహ్నం, సాయంత్రం కూడా ఎటువంటి ఆహారాన్ని తీసుకోవద్దు. అయితే పైన పేర్కొన్న వారు మాత్రం తేలికపాటి అల్పాహారాన్ని మితంగా తీసుకోవాలి. ఉదయం పూట అవకాశం ఉన్నవారు దేవాలయాల సందర్శన, పూజలు, స్తోత్ర పారాయణాలు చేయాలి. వీలైతే తప్పక గోపూజ చేయండి.

ఏకాదశి రోజు రాత్రి జాగరణ చేయాలి. వీలుకాకుంటే నిద్రపోయే వరకు విష్ణునామస్మరణ చేసుకోండి. రాత్రివేళ విష్ణుమూర్తికి సంబంధించిన భాగవతాన్ని చదువుకోవడం, విష్ణుసహస్రనామ పారాయణ చేయాలి.. మర్నాడు ద్వాదశి పారణ చేయాలి. అంటే ప్రాతఃకాలంలోనే లేచి యధావిధిగా నిత్యకాలకృత్యాలు, దేవతారాధన చేసుకుని వెంటనే శుచితో చేసిన మహానైవేద్యాన్ని దేవునికి నైవేద్యంగా సమర్పించి వెంటనే అతిథి ఉంటే వారికి భోజనం పెట్టి మీరు భోజనం చేయాలి. అతిథి లేకుంటే కొంత అన్నాన్ని బలిభుక్కుల కింద కనిపించే, కనిపించని జీవరాశికి ఇంటిబయట ఒక ముద్ద పెట్టి వచ్చి భోజనాన్ని చేయాలి. తొలి ఏకాదశి శివుడికి, అమ్మవారికి, వేంకటేశ్వరస్వామికి చాలా ప్రీతికరం. ఏకాదశి విష్ణుమూర్తికి అత్యంత ప్రీతికరమైనవి.. కనుక ఈ రోజున ఈ దీక్షను ఆచరిస్తే.. శివకేశవులతోపాటు అమ్మ అనుగ్రహం లభిస్తుంది.

# ఉపఎన్నికల్లో హిమాచల్ ముఖ్యమంత్రి భార్య ఘన విజయం

**బీజేపీ అభ్యర్థిపై 9 వేల ఓట్ల మెజార్టీతో కమలేశ్ ఠాకూర్ విజయం**

**హిమాచల్ ప్రదేశ్‌లో 3 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు**

**ఒకచోట బీజేపీ, మరోచోట కాంగ్రెస్ ముందంజ**

**హైదరాబాద్ పెన్ పవర్:**హిమాచల్ ప్రదేశ్‌లోని దేహ్రా అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సఖు భార్య కమలేశ్ ఠాకూర్ ఘన విజయం సాధించారు. సమీప బీజేపీ అభ్యర్థి హొషార్ సింగ్‌పై 9 వేల ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి హొషార్ సింగ్ దాదాపు 4 వేల ఓట్ల మెజార్టీతో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచారు. ఆయన వరుసగా రెండుసార్లు ఇండిపెండెంట్‌గా విజయం సాధించారు. హిమాచల్ ప్రదేశ్‌లో 3 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరిగాయి. మూడు నియోజకవర్గాలకు గాను కాంగ్రెస్ ఓ స్థానంలో గెలవగా, మరో స్థానంలో ముందంజలో ఉంది. ఓ నియోజకవర్గంలో బీజేపీ ముందంజలో ఉంది.

### ప్రజలు బుద్ధి చెప్పారు

2022లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తమకు 40 సీట్లు ఇచ్చారని ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ అన్నారు. ఫిరాయింపులకు పాల్పడిన వారికి ప్రజలు ఉపఎన్నికల్లో బుద్ధి చెప్పారన్నారు. ప్రజాప్రతినిధుల కొనుగోలును తాము సహించేది లేదని ఈ ఫలితాల ద్వారా ప్రజలు స్పష్టం చేశారన్నారు. గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులుగా గెలిచిన ఎమ్మెల్యేలు బీజేపీతో అంటకాగి... రాజీనామా చేసి ఎన్నికలకు వెళ్లారన్నారు. ఎలాంటి కారణాలు లేకుండానే ఆ ముగ్గురు ఎమ్మెల్యేలు రాజీనామా చేశారన్నారు. దీనిని ప్రజలు గమనించారని పేర్కొన్నారు.



# మూత్రం నుంచి తాగునీరు.. కొత్త స్పేస్‌సూట్‌ని ఆవిష్కరించిన శాస్త్రవేత్తలు!

- ప్రత్యేక సూట్‌లు ఆవిష్కరించిన అమెరికాలోని కార్నెల్ యూనివర్సిటీ పరిశోధకులు
- రెండు దశల ఆస్మోసిస్ ఫిల్టర్ ద్వారా నిమిషాల్లోనే మంచినీరు
- కొత్త రీసైక్లింగ్ విధానాన్ని రూపొందించామని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:**అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో గడిపే వ్యోమగాములు మూత్రవిసర్జన నిర్వహణ కోసం కొంతకాలంగా ప్రత్యేకంగా రూపొందించిన స్పేస్‌సూట్‌లను ఉపయోగిస్తున్నారు. సూట్ లోపల డిస్పోజబుల్ డైపర్‌లను ఉపయోగిస్తుంటారు. అయితే ఇకపై వ్యోమగాముల మూత్రం నుంచి నిమిషాల వ్యవధిలో తాగునీరు తయారు చేయవచ్చునని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మూత్రాన్ని తాగునీటిగా మార్చే కొత్త రీసైక్లింగ్ విధానాన్ని ఆవిష్కరించామని చెబుతున్నారు. ఈ మేరకు 'న్యూ సైంటిస్ట్' అనే సైన్స్ మ్యాగజైన్‌లో ఒక అధ్యయనం ప్రచురితమైంది. మూత్రం నుంచి తాగు నీటిని తయారు చేసే సూట్‌ని ఆవిష్కరించామని న్యూయార్క్‌లోని కార్నెల్ విశ్వవిద్యాలయ పరిశోధకులు వెల్లడించారు. 8 కేజీల బరువు ఉంటే పరికరాన్ని రూపొందించామని, దానిని స్పేస్‌సూట్‌లో అమర్చాల్సి ఉంటుందని వెల్లడించారు. ఈ సూట్ రెండు దశల ఆస్మాసిస్ ఫిల్టర్ ద్వారా 87 శాతం సామర్థ్యంతో మూత్రాన్ని రీసైకిల్ చేయగలదని పేర్కొన్నారు. పరిశోధనల్లో భాగంగా కొన్ని గంటల సమయం మాత్రమే స్పేస్‌వాక్ చేసే వ్యోమగాములకు తాము రూపొందించిన స్పేస్‌సూట్ చక్కటి పరిష్కారమని పరిశోధకులు పేర్కొన్నారు. అయితే ఎక్కువ సమయం అంతరిక్షంలో గడిపేవారికి మరింత మెరుగైన పరిష్కారం అవసరం అవుతుందని అభిప్రాయపడ్డారు. కాగా అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా ప్రస్తుతం 'గరిష్ఠ శోషణ వస్త్రం'(పెద్ద వాళ్ల డైపర్ లాంటిది)పై ఆధారపడుతోంది. వ్యోమగాముల మూత్ర, మలాలు ఇందులోకి వెళతాయి. స్పేస్‌వాక్ ముగిశాక వీటిని ఐఎస్ఎస్ వ్యర్థ వ్యవస్థలో పడేస్తారు. ఆ తర్వాత అవి భూవాతావరణంలో కాలిపోతుంటాయి.

# ఉద్యోగాల పేరుతో రూ.24 కోట్లు వసూలు : బోర్డుతిప్పేసిన జాగృతి కన్సల్టెన్సీ




**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ సిటీలో మరో భారీ మోసం బయటపడింది. జూబ్లీహిల్స్ లో జాగృతి కన్సల్టెన్సీ పేరుతో ఓ ఐటీ కంపెనీ ఉంది. ఉద్యోగాలు ఇస్తాం.. ఉద్యోగాలు ఇప్పిస్తాం అంటూ భారీ ఎత్తున డిజిటల్ అండ్ సోషల్ మీడియాలో ప్రచారం చేసింది. నమ్మిన నిరుద్యోగులు కంపెనీకి పోటెత్తారు. ఇక్కడే తన కుట్రను అమలు చేసింది జాగృతి కన్సల్టెన్సీ.ఉద్యోగం ఊరికే రాదు.. 2 లక్షల రూపాయల డిపాజిట్ చేయాలని కండీషన్ పెట్టింది. ఐటీ కంపెనీ.. ఐటీ కంపెనీలో ఉద్యోగం కదా అని.. 12 వందల మంది నిరుద్యోగులు.. తలా 2 లక్షల రూపాయలు కట్టారు. 2 లక్షలు కట్టినోళ్లకు ఫేక్ ఆఫర్ లెటర్స్ తో ఉద్యోగాలు ఇచ్చింది.. ఆఫీసుల్లో సీట్లు కూడా ఏర్పాటు చేసింది. కాకపోతే జీతాలు మాత్రమే ఇవ్వలేదు.. మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవటంతో కంపెనీని నిలదీశారు ఉద్యోగులు. జీతాలు అయినా ఇవ్వండి లేదంటే మేం కట్టిన 2 లక్షల రూపాయలు అయినా తిరిగి ఇవ్వండి అంటూ డిమాండ్ చేశారు. పరిస్థితులు చేయిదాటి పోవటంతో.. రాత్రికి రాత్రి బోర్డు తిప్పేసింది జూబ్లీహిల్స్ లోని జాగృతి కన్సల్టెన్సీ. మొత్తం 12 వందల మంది నుంచి 24 కోట్ల రూపాయలను జాగృతి కన్సల్టెన్సీ డైరెక్టర్ జగదీశ్ వసూలు చేసినట్లు చెబుతున్నారు బాధిత నిరుద్యోగులు. ఇప్పుడు ఆఫీసుకు తాళాలు వేసి వెళ్లిపోయారని.. కంపెనీ మోసం చేసిందంటూ పోలీస్ కంప్లయింట్ ఇచ్చారు.

# నా సామి రంగా.. వీటిని రోజూ తిన్నారంటే... మీ బాడీలో జరిగేది ఇదే



**హైదరాబాద్ పెన్ పవర్:** వంటింట్లో దొరికే చాలా రకాల ఆహార పదార్థాలతో చాలా రకాల అనారోగ్య సమస్యలను తగ్గించుకోవచ్చు. ఏదైనా అనారోగ్యం బారిన పడితే ఆసుపత్రికి వెళ్లకుండానే వంటింట్లో లభించే ఆహారపదార్థాలను తీసుకుని అనారోగ్యానికి చెక్ పెట్టవచ్చు. ముఖ్యంగా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, డ్రైఫ్రూట్స్ వంటివి మాత్రమే ఆరోగ్యానికి ప్రయోజనాలు చేకూరుస్తాయని అనుకుంటారు. కానీ వంటింట్లో దొరికే మసాలా దినుసులు కూడా ఆరోగ్యానికి ప్రయోజనాలు చేస్తాయి. మసాలా దినుసులను చాలా రకాల ఆయుర్వేద మందుల్లో ఉపయోగిస్తుంటారు. అందులో ముఖ్యంగా లవంగాలు దివ్యఔషధం అనే చెప్పాలి.

లవంగాలు చాలా రకాల అనారోగ్య సమస్యలకు నివారణగా పనిచేస్తాయి. లవంగాల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వీటిని రోజుకు రెండు తిన్నారంటే అనేక సమస్యల నుంచి కాపాడుకోవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఐరన్, పొటాషియం, కాల్షియం, సోడియం, ఫాస్పరస్, ఐరన్, కార్బోహైడ్రేట్లు వంటివి ఉండడం వల్ల ఇవి ఆరోగ్యానికి చాలా ప్రయోజనాలను చేకూరుస్తాయి. లవంగాలను ప్రతీరోజూ రెండు చొప్పున తీసుకోవడం వల్ల డయాబెటిస్ వంటి దీర్ఘకాలిక వ్యాధికి చెక్ పెట్టవచ్చు. శరీరంలో ఇన్సులిన్ చర్యను మెరుగుపరచడంలోను ఇది తోడ్పడుతుంది. ప్రతీరోజూ రాత్రి భోజనం తర్వాత రెండు లేదా మూడు లవంగాలను తినడం వల్ల శరీరంలోని కొవ్వును కూడా కరిగించుకోవచ్చు. అంతేకాదు ఒత్తిడి, ఆయాసం, జీర్ణక్రియ వంటి సమస్యలను కూడా తగ్గించుకోవచ్చు. ఇంకా శరీరంలో కొత్త కణాలను ఉత్పత్తి చేయడంలోను సహాయపడుతుంది. సైనస్ వంటి సమస్యతో బాధపడేవారు లవంగాలను పొడి చేసి నీళ్లలో తడిపి దానిని ముక్కు దగ్గర పెట్టుకుంటే సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. లవంగాలతో క్యాన్సర్ వంటి ప్రాణాంతకర వ్యాధిని నివారించవచ్చని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

లవంగాలతో పాటు తులసి, పుదీనా, యాలకులను కూడా కలిపి కషాయం చేసుకుని తాగడం వల్ల నరాల బలహీనత, మానసిక ఒత్తిడి వంటి సమస్యలు తగ్గించుకోవచ్చు.లవంగాలను తీసుకోవడం వల్ల జీవక్రియ రేటు కూడా పెరుగుతుంది. ముఖ్యంగా అధిక బరువు వంటి సమస్యతో బాధపడేవారికి లవంగాలు సహాయపడతాయి. వీటిని తినడం వల్ల శరీరంలో అదనంగా పేరుకుపోయిన కొవ్వును కరిగిస్తుంది. దంతాల సమస్య, నోటి దుర్వాస వంటి సమస్యలు ఉంటే నోటిలోని చెడు బ్యాక్టీరియాను తొలగించేలా చేస్తుంది.

# వర్షపు నీరు తాగొచ్చా.. తాగితే ఏమవుతుందో తెలుసా..



**హైదరాబాద్ పెన్ పవర్:**మన తాత ముత్తాతలు వర్షం వస్తే చాలు.. చాలా మంది వానలో తడుస్తూ ఎంజాయి చేసేవారు .. కాని ఇప్పుడు వర్షంలో తడిస్తే చాలు.. మరుసటి రోజు జలుబు .. దగ్గుతో ఆఫీసు దుమ్మా కొట్టాల్సిందే.. కాని పూర్వకాలంలో వర్షపు నీటిని గ్లాసులో పట్టుకొని తాగేవారు.. వానా.. వానా వల్లప్ప అని పాడుకునే రోజులు పోయాయి.. రెయిన్?..రెయిన్? ఈజ్? పెయిన్?? అంటున్నారు యువత. అది నాటి తరానికి నేటి తరానికి అదే తేడా. చాలా మంది వాన నీటిని ఒడిసిపట్టి దానిని మంచినీటిగా ఉపయోగించుకుంటే ఎంతో ఆరోగ్యం అని భావిస్తుంటారు. అయితే వర్షపు నీరు తాగొచ్చా.. ఆరోగ్యమా.. అనారోగ్యమా.. మొదలగు విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం. . . వెనకటి కాలంలో కాలుష్యం చాలా తక్కువగా ఉండేది. దానితో నదులు, సముద్రాలు స్వచ్ఛంగా ఉండేవి. వాటర్ సైక్లింగ్ థీరీని అనుసరించి వర్షాలు పడేవి. మారుతున్న కాలానికి వాతావరణ కాలుష్యం సమాజానికి పెను ముప్పుగా వాటిల్లుతోంది. వాతావరణంలో వాయు కాలుష్యంతో ఆకాశంలో మేఘాలు సైతం కాలుష్యానికి లోనవుతున్నాయి. ఇన్ని కాలుష్యాల మధ్య స్వచ్ఛమైన వాన నీటిని ఆస్వాదించడం ప్రమాదకరమే అంటున్నారు ఆరోగ్య నిపుణులు. గతేడాది వరకు వర్షం సినిమాలోని పాటను ఎన్నాళ్లకు గుర్తొచ్చానా వానా అంటూ తడుస్తూ పాడుకొనేవారు. పూర్వ కాలంలో వాన నీటితో నిండిన చెరువులు, కుంటల నుంచి కుండలతో ఇంటికి తెచ్చుకుని వంటలు వండుకునేవారు. పైగా తాగునీటికి కూడా అవే నీటిని వాడుకునేవారు. ఇప్పుడు కేవలం శుద్ధిచేసిన నీటినే మనం వాడుకునే పరిస్థితి ఏర్పడింది. వాటిపైనా నమ్మకం లేక చాలా మంది ఇళ్ల లో వాటర్ ప్యూరిఫైర్ వాడుతున్నారు. ఆరోగ్యానికి ప్రయారిటీ ఇచ్చే నేటి తరం ఈ విషయంలో మాత్రం చాలా శ్రద్ధ తీసుకుంటున్నారు. వర్షపు నీటిలో కంటికి కనిపించని సూక్ష్మ జీవులు ఉంటాయి. దానితోనే సీజనల్ జబ్బులు, వైరల్ ఇన్ఫెక్షన్లు సోకుతున్నాయి అని వైద్యులు చెబుతున్నారు. వర్షపు నీటిలో ఆల్కలీన్ శాతం అధికంగా ఉంటుంది. అదే నాలా వాటర్ శుద్ధి చేసి పంపిణీ చేస్తారు.

**వర్షపు నీటిని మరిగించి**

వర్షపు నీటిని మరిగించి చల్లార్చి తాగవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. అంతేకాదు వర్షపు నీటిని తాగడానికి తప్ప ఇతరత్రా అవసరాలకు వాడుకోవచ్చని చెబుతున్నారు. బట్టలు ఉతకడం, ఇంటిని ఒంటిని శుభ్రపరుచుకోవడం, మొక్కలకు నీటి అవసరాల కోసం వర్షపునీటిని వాడుకోవచ్చని అంటున్నారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండేవారు వర్షపు నీటిని అస్సలు తాగకూడదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అలాగే బీపీ, షుగర్ ఉన్నవాళ్లు కూడా వర్షపు నీటిని సేవించకూడదని సూచిస్తున్నారు.

**ఇంకుడు గుంతల ఆవశ్యకత**

ప్రస్తుతం ఎతి అపార్టు మెంటులలో వర్షపు నీటిని వృథా కాకుండా ఇంకుడు గుంతలను వృద్ధి చేస్తున్నారు. దీని వలన వర్షపు నీరు భూగర్భాలకు చేరుకుని భూగర్భ జలాలు ఇంకిపోకుండా సహాయ కారిగా ఉంటుంది. అయితే ఇంకుడు గుంతలలోని నీటిని ఎట్టి పరిస్థితిలోనూ తాగేందుకు ఉపయోగించరాదు. ఇంకుడు గుంతలలో నీటిని ట్యాంకులకు చేర్చుకున్నాకాని ఇతరత్రా అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని వైద్యులు సూచిస్తున్నారు. పాత తరం వాళ్లు వర్షపు నీటిని తాగి మేమంతా ఆరోగ్యంగా లేమా అని వాదిస్తుంటారు. అయితే అవన్నీ ఆ తరానికి ఆమోద యోగ్యమే కానీ నేటి తరానికి ఎంత మాత్రం ఆరోగ్యకరం కాదు. పైగా హానికరం అని వైద్యులు హెచ్చరిస్తున్నారు.